సాక్షి మంచిర్యాల

గురువారం । 16 । జనవరి । 2025



విషాదయాత్ర..! 8లో▸

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో యాత్రికుల బస్సు అగ్నిప్రమాదంలో కాలిపోయింది. ఒకరు సజీవదహనం కాగా.. దర్శనానికి వెళ్లడంతో మిగతా యాత్రికులు క్షేమంగా ఉన్నారు.



తొడసం వంశీయుల మహాపూజ

నార్నూర్‌లోని ఖందేవ్ ఆలయంలో తొడసం వంశీయులు మహాపూజ నిర్వహించారు. ఆచారం ప్రకారం నువ్వుల నూనెను ఆడపడుచు తాగి మొక్కు తీర్చుకుంది. 8లో▸

గరిష్టం/కనిష్టం
29.0 /18.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా గాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి.

న్యూస్‌రీల్

ఘనంగా మకర నక్షత్ర దర్శన వేడుకలు



మూల విరాట్టుకు అభిషేక పూజలు

దండేపల్లి: మండలంలోని గూడెం అభినవ శబరిమలై అయ్యప్పస్వామి ఆలయంలో మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా మంగళవారం రాత్రి మకర నక్షత్ర దర్శన వేడుకలు వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్టుకు అభిషేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలోని పదునెట్టాం బడిపై దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. స్వామివారి తిరు ఆభరణాలు ఊరేగించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ వ్యవస్థాపక గురుస్వామి పురుషోత్తమాచార్యులు, పలువురు అయ్యప్ప దీక్షస్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి



మోకుదెబ్బ జాతీయ కమిటీ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గౌడ సంఘం నాయకులు

పాతమంచిర్యాల: హక్కుల సాధన కోసం గౌడ కులస్తులందరూ ఐక్యంగా ఉద్యమించాలని మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టుభవన్‌లో గౌడజన హక్కుల పోరాట సమితి, మోకుదెబ్బ సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ కులస్తులు రాజకీయ పార్టీలకు అతీతంగా కల్లుగీత వృత్తి రక్షణ, రాజ్యాధికార సాధనకు ఉద్యమించాలని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఏజెన్సీ ప్రాంతాల్లోని గీతకార్మికులను ఎస్టీలుగా గుర్తించాలని అన్నారు. మోకుదెబ్బ జాతీయ కమిటీ 2025 నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు, జువ్వాజీ అనిల్‌గౌడ్, కార్యదర్శి బాలసాని శ్రీనివాసగౌడ్, నాయకులు కొండా మురళీధర్, జిల్లా అధ్యక్షుడు దుర్గం రాజేశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వొల్లాల నర్సాగౌడ్, ప్రధాన కార్యదర్శి పోడేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరం



బెల్లంపల్లి: స్టేషన్ రోడ్డులోని ఓ ఇంటి ముందు ముగ్గు వేస్తున్న మహిళలు



హాజీపూర్ మండలం గొల్లపల్లిలో..



చెన్నూర్: అయ్యప్ప ముగ్గుతో అలేఖ్య



మంచిర్యాలలో ఎంఈవో మాణిదేవి



హాజీపూర్‌లో పతంగులు ఎగురవేస్తూ..



దండేపల్లిలో నోములు

జిల్లాలో మంగళవారం సంక్రాంతి సంబరం అంబరాన్నంటింది. మహిళలు, యువతులు ఇళ్ల ముందు వేసిన రంగు రంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. పల్లెల్లో గంగిరెద్దుల విన్యాసాలు అలరించాయి. చిన్నారులు పతంగులు ఎగురవేస్తూ ఆనందంగా గడిపారు. బుధవారం కనుమ పండుగలో భాగంగా మహిళలు ఒకరి ఇంటికి ఒకరు వెళ్తూ సంక్రాంతి నోముల సందర్భంగా పసుపు, కుంకుమలతో వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. - వివరాలు 9లో▸

రేషన్‌కార్డుల లెక్క తేలింది..!

- కార్డులు లేని కుటుంబాలు 18,788
- కులగణన సర్వే ప్రకారం సేకరణ
- గ్రామ, వార్డు సభల్లో అర్హుల గుర్తింపు
- 26నుంచి కొత్తకార్డుల జారీకి ఏర్పాట్లు



బెల్లంపల్లి 11వ వార్డులో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సమగ్ర ఇంటింటి సర్వే ఆధారంగా కొత్త రేషన్‌కార్డుల జారీకి మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మేరకు జిల్లాలో గత ఏడాది నవంబర్‌లో చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వేలో రేషన్‌కార్డులు లేని కుటుంబాల జాబితా మండలాలు, మున్సిపాల్టీల వారీగా సిద్ధమైంది. జిల్లాలో 2,54,249 ఇళ్లు ఉండగా.. 463 రేషన్ దుకాణాలు ఉన్నాయి. రేషన్ కార్డుదారులు 2,19,190 ఉన్నారు. తాజాగా సమగ్ర సర్వేలో 18,788 కుటుంబాలకు రేషన్‌కార్డులు లేవని గుర్తించారు. వీటి ఆధారంగా మండల స్థాయిలో ఎంపీడీవోలు, మున్సిపాల్టీల్లో మున్సిపల్ కమిషనర్లు లబ్ధిదారులను గుర్తించే బాధ్యతలు చేపట్టనున్నారు. జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్(రెవెన్యూ), జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు పర్యవేక్షిస్తారు. ఇందుకోసం సర్వేలో రేషన్‌కార్డులు లేని కుటుంబాల వివరాల సేకరణ ప్రక్రియ పూర్తి చేశారు. రేషన్‌కార్డులు లేని వారి వివరాలను జాబితాను ఆయా గ్రామాలు, మున్సిపాల్టీల్లోని వార్డులు ప్రదర్శించి గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తారు. ఆ జాబితాను చదివి వినిపించి చర్చించిన తర్వాతే అర్హులను ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లు గుర్తించి వారికి ఇచ్చిన లాగిన్‌లో నమోదు చేయనున్నారు. ఆ తర్వాత జిల్లా కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు పంపించి కొత్త రేషన్ కార్డులు జారీ చేసేలా ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. వీటితోపాటు రేషన్‌కార్డుల్లో పేర్లు మార్పు చేసుకునేందుకు కూడా అవకాశం కల్పించగా.. ఈ ప్రక్రియను పూర్తి చేసి ఈ నెల 26నుంచి రేషన్‌కార్డులు జారీ చేసేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రజాపాలన ద్వారా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు కాకుండా కులగణన సర్వేలో రేషన్‌కార్డులు లేని చెప్పిన వారి వివరాలతోనే ప్రస్తుతం కొత్త రేషన్‌కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం ముందుకు వెళ్తోంది.

కుటుంబ సమగ్ర సర్వేలో రేషన్‌కార్డులు లేని కుటుంబాల వివరాలు



మండలం	కుటుంబాలు
మందమర్రి	314
భీమారం	410
వేమనపల్లి	591
బెల్లంపల్లి	735
కోటపల్లి	975
చెన్నూరు	827
జైపూర్	913
జన్నారం	1,347
తాండూర్	846
లక్సెట్టిపేట	619
నెన్నెల	507
కాసిపేట	872
కన్నెపల్లి	523
హాజీపూర్	614
దండేపల్లి	1,166
భీమిని	508
మొత్తం	11,767
మున్సిపాలిటీ	
మంచిర్యాల	2,025
లక్సెట్టిపేట	414
చెన్నూరు	406
బెల్లంపల్లి	1,301
క్యాతన్‌పల్లి	838
నస్పూర్	1,305
మందమర్రి	732
మొత్తం	7,021

అర్హులైన కుటుంబాలకు మంజూరు

- కలెక్టర్ కుమార్ దీపక్
- వార్డులో సర్వే పరిశీలన



తాండూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

బెల్లంపల్లి: అర్హులైన ప్రతీ కుటుంబానికి రేషన్ కార్డు మంజూరుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి మున్సిపాల్టీలోని 11వ వార్డులో రేషన్‌కార్డుల సర్వేను ఆకస్మికంగా పరిశీలించారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల మంజూరు పథకాల అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి అర్హులైన లబ్ధిదారుల జాబితా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పథకాల అమలు జరగనుందని, అంతకుముందే లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలని, గడువులోగా కలెక్టర్ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. 11వ వార్డులో రేషన్‌కార్డుల కోసం 1,031 దరఖాస్తులు అందాయని, వీటిని పరిశీలించి లబ్ధిదారుల జాబితా తయారు చేస్తామని తెలిపారు. అనంతరం ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలు సందర్శించారు. ఆర్డీవో కార్యాలయంలో ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ జ్యోత్స్న, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, చైర్‌పర్సన్ శ్వేత పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

తాండూర్: ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం తాండూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైతు భరోసా అర్హత కలిగిన అందరికీ అందించాల్సి ఉందన్నారు. రెవెన్యూ, వ్యవసాయ భూముల రికార్డుల ప్రకారం గ్రామాల్లో సాగు భూములను పరిశీలించి నివేదిక తయారు చేయాలన్నారు. సాగుకాని భూముల లెక్కలు తేల్చాలని పేర్కొన్నారు. ఈ నెల 16నుంచి 21లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుందని ఆదేశించారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, డెప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.

అలరించిన అష్టావధానం



అష్టావధానం కార్యక్రమం

మంచిర్యాలఅర్బన్: సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో మంచిర్యాలలో మకర సంక్రాంతిని పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన అష్టావధానం అలరించింది. ద్వాదశ అష్టావధానం ప్రశ్నికులు అడిగిన ప్రశ్నలకు అవధాని మారేపల్లి వెంకటరమణ పట్వర్ధన్ ఎంతో అద్భుతంగా సమాధానాలు ఇచ్చారు. సంక్రాంతి ప్రాముఖ్యత అవధానం ఓ అసెంబ్లీ అనుకుంటే దానిలో అవధాని ముఖ్యమంత్రిగా సంచాలకులు స్పీకర్, పలువురు కవులు ప్రతిపక్ష నాయకులుగా పద్యరూపంలో వర్ణణాంశంగా అభివర్ణించారు. విశేషమైన పద్య పటుత్వాన్ని ప్రదర్శిస్తూ ఇంతవరకు మూడు శతావధానాలు పూర్తి చేసుకుని 124 అష్టావధానాలు చేస్తూ వచ్చే ఏప్రిల్‌లో మరో శతావధానం తెలుగు యూనివర్సిటీలో చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వామన్‌రావు, అల్లాడి శ్రీనివాస్, కవులు శ్రీనాథ్, ప్రసాద్, బ్రహ్మయ్యాచార్య, జగన్‌మోహన్‌రావు, సుగుణాకర్, రాకుమార, దక్షిణామూర్తి, చంద్రశేఖర్ వెంకట్రాయశర్మ ,బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

డీఈవో కార్యాలయ ఏడీగా లలిత



లలితను సత్కరిస్తున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)గా ఎల్.లలిత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మెదక్ డైట్ కళాశాలలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆమె ఏడీగా మంచిర్యాల డీఈవో కార్యాలయానికి పదోన్నతిపై వచ్చారు. లలితను డీఈవో యాదయ్యతోపాటు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది శాలువాలతో సత్కరించారు.

ఆకట్టుకున్న ఎడ్లబండ్ల పోటీలు



బహుమతి అందుకుంటున్న సీతారాంపల్లి వాసి

జైపూర్: మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలు ఆకట్టుకున్నాయి. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు చందుపట్ల జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పోటీల్లో ఆయా గ్రామాలకు చెందిన వారు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సీతారాంపల్లి వాసి మొదటి బహుమతి రూ.10వేలు, ద్వితీయ జెండా వెంకటాపూర్ వాసి రూ.8వేలు, మూడో బహుమతి టీకులపల్లి వాసి రూ.6వేలు గెలుపొందారు. పోటీలను చూడడానికి పరిసర ప్రాంతాల యువకులు, నాయకులు తరలివచ్చారు.

లింగంపల్లిలో..

చెన్నూర్‌రూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని లింగంపల్లి గ్రామంలో మంగళవారం ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. మాజీ జెడ్పీవైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ అంగ లక్ష్మి, రమేశ్ పోటీలను ప్రారంభించారు. 12 ఎడ్ల బండ్లు పాల్గొనగా మందమర్రికి చెందిన జిట్టబోయిన రాజమల్లు మొదటిస్థానం, లింగంపల్లికి చెందిన ఉడుత ఐలేశ్ రెండవ స్థానం, భీమారానికి చెందిన దుర్గం లక్ష్మణ్ మూడవ స్థానంలో నిలిచారు. ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ రూ.3వేలు, తృతీయ రూ.2వేలు అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చల్ల రాంరెడ్డి పాల్గొన్నారు.

చేనేతకు పునర్జీవం



చెన్నూర్ చేనేత సొసైటీలో మగ్గాలు

- కార్మికుల సంక్షేమానికి మూడు పథకాలు
- నిధులు కేటాయించిన ప్రభుత్వం

చెన్నూర్: చేనేతకు రాష్ట్ర ప్రభుత్వం పునర్జీవం ఇచ్చింది. రోజు రోజుకు కనుమరుగవుతున్న చేనేత రంగం అభివృద్ధికి పెద్దపీట వేసింది. చేనేత పరిశ్రమతోపాటు కార్మిక సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నేతన్న పొదుపు, నేత భద్రత కోసం నేతన్న బీమా, నేతన్న భరోసా పథకాల అమలుకు రూ.168కోట్లు కేటాయించింది. దీంతో చేనేత పరిశ్రమతోపాటు చేనేత కార్మికులకు మేలు చేకూరనుంది. చేనేతను నమ్ముకుని జీవనం సాగిస్తున్న కార్మికులకు లబ్ధి చేకూరుతుంది. దీంతో వస్త్ర ఉత్పత్తి పెరిగి పరిశ్రమ అభివృద్ధి దిశగా పయనిస్తుందని పలువురు చేనేత కార్మికులు పేర్కొంటున్నారు.

రెండు జిల్లాల్లో వంద కుటుంబాలు

మంచిర్యాల జిల్లా చెన్నూర్ చేనేత సొసైటీలో 70 మంది కార్మికులు, కుమురంభీంఆసిఫాబాద్ జిల్లా కొసిని సొసైటీలో 30మంది కార్మికులు పని చేస్తున్నారు. ఒకప్పుడు వేల మంది కార్మికులతో కళకళలాడిన చేనేత సొసైటీల్లో నేడు కార్మికుల సంఖ్య వంద దిగువకు పడిపోయింది. కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న కార్మికులకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. పలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చే విధంగా అమలుకు సన్నద్ధమైంది. ఇందుకు సంబంధించి నిధులు కేటాయించడంతో కార్మికులకు చేనేత పనిపై ఆసక్తి పెరిగే అవకాశం ఉంది.

నేతన్న పొదుపు పథకం..

చేనేత కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు నేతన్న పొదుపు నిధి కింద ప్రభుత్వం రూ.115కోట్లు కేటాయించింది. కార్మికుడు తన వాటా కింద 8శాతం పొదుపు చేస్తే ప్రభుత్వం 16శాతం వాటా మంజూరు చేస్తుంది. దీంతో ఈ పథకం ద్వారా కార్మికుడికి, అనుబంధ కార్మికులకు రూ.38 వేల లబ్ధి చేకూరుతుంది.

నేతన్న భద్రత(బీమా)

చేనేత కార్మికుడు ఏ కారణం చేతనైన మృతిచెందితే కుటుంబంలోని నామినీకి రూ.5 లక్షలు చెల్లిస్తారు. ఈ పథకం 18 నుంచి 59సంవత్సరాలు ఉన్న కార్మికులకు ఎల్ఐసీ ద్వారా, 59 సంవత్సరాలు పైబడిన కార్మికులకు టీజీఎస్‌సీవో ద్వారా బీమా సొమ్ము చెల్లిస్తారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.9కోట్లు కేటాయించింది.


కార్మికులకు మేలు



ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతో కార్మికులకు మేలు జరుగుతుంది. చేనేతను నమ్ముకొని జీవనం సాగిస్తున్న కార్మికులకు నేతన్న భరోసాతో చాలా లాభం చేకూరుతుంది. ప్రభుత్వం ప్రతీ కార్మికునికి బీమా వర్తింపజేయడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం 60 సంవత్సరాలు పైబడిన కార్మికులు సైతం నేడు మగ్గాలను నమ్ముకుని బతుకుతున్నారు.

–ఇప్పులపల్లి కిష్టయ్య, చెన్నూర్ చేనేత సొసైటీ అధ్యక్షుడు

ఉత్పత్తి పెరుగుతుంది..



ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోనే చెన్నూర్ సొసైటీ పెద్దది. ఇక్కడ వస్త్ర ఉత్పత్తి సైతం బాగుంది. 70 మంది కార్మికులు పని చేస్తున్నారు. ప్రభుత్వం మూడు పథకాలకు నిధులు కేటాయించడంతో కార్మికులకు మంచి లాభం జరుగుతుంది. వస్త్ర ఉత్పత్తి పెరుగుతుంది.

–బల్ల శశిధర్, చేనేత సొసైటీ కార్యదర్శి, చెన్నూర్

నేతన్న భరోసా

ప్రభుత్వం తెలంగాణ మార్క్ లేబుల్‌ను ఉపయోగించి తయారు చేసిన వస్త్ర ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు, కార్మికులకు వేతన మద్దతు అందించాలనే ఉద్దేశంతో నేతన భరోసా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింది ఒక్కో కార్మికుడికి పని ఆధారంగా రూ.18 వేల వరకు అనుబంధ కార్మికునికి రూ.6 వేలు చొప్పున మంజూరు చేస్తారు. నేతన్న భరోసాకు ప్రభుత్వం రూ.44 కోట్లు కేటాయించింది.

పర్యాటక కేంద్రంగా జిల్లాకు గుర్తింపు



వాహనంలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, కలెక్టర్ కుమార్‌దీపక్, జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు
- జంగల్ సఫారీ ప్రారంభం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలోనూ పర్యాటక కేంద్రంగా త్వరలోనే గుర్తింపు సాధించనుందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. హాజీపూర్ మండలం గఢ్‌పూర్ గ్రామం ఎంసీసీ క్వారీ అడవిలో ఏర్పాటు చేసిన గాంధారీ ఖిల్లా జంగల్ సఫారీని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్, జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. అంతకు ముందు సఫారీ ఆవరణలో మొక్కలు నాటి జంగల్ సఫారీ రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ 25 కిలోమీటర్లు విస్తరించి ఉన్న జంగల్ సఫారీలో వివిధ రకాల అటవీ వన్యప్రాణులను ప్రత్యక్షంగా వీక్షించడం ద్వారా గొప్ప అనుభూతి సొంతమవుతుందని అన్నారు. భవిష్యత్‌లో ఈ జంగల్ సఫారీకి పర్యాటకుల తాకిడి పెరిగి రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని తెలిపారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ వైల్డ్ లైఫ్ సఫారీకి ప్రత్యేక గుర్తింపు లభించేలా అటవీ అధికారులు కృషి చేయాలన్నారు. రెండు పులులు ఈ ప్రాంతంలో ఉన్నాయని, జంగల్ సఫారీ విజయవంతమైతే పర్యాటక కేంద్రంగా మారుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, జిల్లా అటవీ అభివృద్ధి అధికారి సర్వేశ్వర్, లక్సెట్టిపేట అటవీ రేంజ్ అధికారి అత్తె సుభాష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అటవీ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలన్నీ పరిష్కరించాలి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణం టూటౌన్‌లోని ప్రజల సమస్యలన్నీ అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు ఆదేశించారు. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌నగర్, హమాలీవాడ, దొరగారిపల్లె, రాజీవ్‌నగర్, గోపాల్‌వాడ, సూర్యనగర్, రాజరాజేశ్వరి కాలనీలోని పలు వార్డుల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని అభివృద్ధి పనులు పరిశీలించారు. ప్రజల సమస్యలు వింటూనే పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడారు. రాజీవ్‌నగర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేకాటస్థావరంపై దాడి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం సబ్బెపల్లి శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సబ్బెపల్లి శివారులో మంగళవారం కొంతమంది పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 41,150 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో గొల్లపల్లికి చెందిన అనవేణి రాజయ్య, కర్ణమామిడికి చెందిన గోల్ల తిరుపతి, దొనబండ గ్రామానికి చెందిన తుమ్మకొమ్మ ప్రసాద్, కొంక భూమయ్యలు ఉండగా రవి, మేకల రమేశ్‌లు పరారీలో ఉన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సీజ్ చేసిన వాహనాల వేలం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వివిధ నేరాలు, కేసుల్లో పట్టుబడిన వాహనాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్పీ గౌస్ ఆలం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 21 పోలీస్‌స్టేషన్ల పరిధిలో స్వాధీనం చేసుకున్నవి, గుర్తు తెలియని వ్యక్తులు వదిలివెళ్లిన 73 వాహనాలను త్వరలో వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్‌హెడ్‌క్వార్టర్స్‌లో బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు రిజర్వు ఇన్‌స్పెక్టర్ మురళీ 87126 59962పై సంప్రదించాలన్నారు.

మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరణ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరించిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక బుధవార్‌పేట్ కాలనీకి చెందిన నళినీ తన కూతురుతో కలిసి కాలనీలో నడుచుకుంటూ వెళ్తుంది. వెనుక వైపు నుంచి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న 1.5తులం, సుమారు రూ.1.20 లక్ష విలువగల బంగారు గొలుసు లాక్కెళ్లారు. దీంతో వెంటనే చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కాలనీలో గల సీసీ కెమెరాలు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఒకరిపై పోక్సో కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ యువకుడిపై ఆదిలాబాద్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ బాలిక ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తి కోసం ఈనెల 9న సికింద్రాబాద్‌కు వెళ్లింది. కాగా బాలిక ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు 10న టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆమెను గుర్తించి రంగారెడ్డి జిల్లాకు చెందిన 22 ఏళ్ల యువకుడు శివమణితో పాటు జిల్లా కేంద్రానికి తీసుకొచ్చారు. కాగా శివమణిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు.

భైంసా డివిజన్ వాసుల తీర్థయాత్ర విషాదయాత్రగా మిగిలింది. ఎంతో సంతోషంతో 15 రోజులపాటు పుణ్యక్షేత్రాలు సందర్శించిన వారు మంగళవారం యూపీలోని బృందావన్‌కు చేరుకున్నారు. పక్కకు నిలిపిన బస్సులో తమ తోటి యాత్రికుడు సజీవదహనం కావడం యాత్రికులను దిగ్భ్రాంతికి లోనుచేసింది. భర్తను కోల్పోయిన భార్య అతడికి అక్కడే అంత్యక్రియలు జరిపి ఇతర యాత్రికులతో కలిసి వెనుదిరిగిన హృదయ విషాదకర ఘటన అందరిని కంటతడి పెట్టించింది. - భైంసా



యూపీలోని బృందావన్‌లో మంటల్లో కాలుతున్న యాత్రికుల బస్సు

విషాదయాత్ర..!



వివరాలు సేకరిస్తున్న యూపీ అధికారులు

- కాశీ యాత్రికుల బస్సు దగ్ధం
- పల్సి గ్రామవాసి సజీవ దహనం
- యూపీలోని బృందావన్‌లో ఘటన
- ఆగి ఉన్న చోటే అగ్ని ప్రమాదం
- దర్శనానికి వెళ్లిన మిగితా వారు క్షేమం
- వెనుదిరిగిన యాత్రికులు

కాశీ తీర్థయాత్రలకు వెళ్లిన జిల్లా యాత్రికుల్లో ఒకరు మంగళవారం రాత్రి బస్సులోనే సజీవదహనమైన ఘటన జిల్లాలో కలకలం రేపింది. భైంసా డివిజన్ కుభీర్ మండలం పల్సి, సాంవ్లీ, భైంసా పట్టణంలోని కోర్బగల్లీ, చుట్టుపక్కల పల్లెలకు చెందిన 54 మంది యాత్రికులు ఈనెల 1వ తేదీన కాశీతీర్థయాత్రలకు బయలుదేరారు. 15 రోజులపాటు వివిధ పుణ్యక్షేత్రాలను దర్శించుకుని మంగళవారం ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్‌కు చేరుకున్నారు. అప్పటి వరకు ఎంతో ఆనందంగా గడిపిన యాత్రికులు బృందావన్‌లో సంక్రాంతి వేడుకలు జరుపుకోవాలని నిర్ణయించుకున్నారు. బృందావన్‌లో బస్సు నిలిపి ఒక్కరు మినహా మిగితా వారంతా దర్శనం కోసం వెళ్లారు. కానీ ఒక్కసారిగా బస్సులో మంటలు చెలరేగి బస్సు పూర్తిగా కాలిపోయింది. బస్సులో నిద్రిస్తున్న యాత్రికుడు శిల్యం దుర్పతి(70) సజీవ దహనమయ్యాడు. జరిగిన సంఘటనతో ఒక్కసారిగా యాత్రికులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందో ఎవరూ చెప్పలేకపోతున్నారు. షార్ట్ సర్క్యూట్‌తోనే అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని కొందరు భావిస్తున్నారు. ఘటనకు సంబంధించిన వివరాలను అక్కడి అధికారులు వెల్లడించాల్సి ఉంది. బస్సు కాలిపోయిందన్న విషయం తెలుసుకున్న యాత్రికుల కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

18న తిరిగివస్తామని..

ఈనెల 1న 54 మందితో కాశీ తీర్థయాత్రలకు బస్సు బయలుదేరింది. భైంసాకు చెందిన సమైకర్ భగవాన్ ఆధ్వర్యంలో తీర్థయాత్ర ప్రారంభమైంది. ఒక్కొక్కరికి రూ. 13వేలు చొప్పున తీసుకుని యాత్రలకు తీసుకెళ్లారు. పుణ్యక్షేత్రాలను దర్శిస్తూ కాశీవెళ్లి ఈనెల 18న భైంసాకు వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు. యాత్రీకులు తమకు కావాల్సిన బట్టలు, దుప్పట్లు, రోజువారీగా వేసుకునే ట్యాబ్లెట్లు, అల్పాహారం తీసుకుని బస్సు ఎక్కారు. 15 రోజులపాటు పుణ్యక్షేత్రాలు దర్శించుకుని మంగళవారం ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్‌కు చేరుకున్నారు. అక్కడ బస్సు నిలిపి 53 మంది దర్శనానికి వెళ్లిపోయారు. ఒక్కసారిగా మంటలు చెలరేగి బస్సు దగ్ధమైంది. బస్సులో నుంచి వచ్చిన మంటలతో యాత్రికుల సామగ్రి, నగదు, అన్ని కాలిపోయాయి. శిల్యం దుర్పతి శరీరమంతా కాలి అస్తికలే మిగిలాయి. ప్రమాదం జరిగిన కొన్ని గంటల్లోనే ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్‌మీడియాలో ప్రసారమయ్యాయి. యాత్రికుల బంధువులు, తోబుట్టువులు, స్నేహితులు వారి క్షేమసమాచారం కోసం తంటాలు పడ్డారు. రాత్రంతా మెలుకువగా ఉండి ఎప్పటికప్పుడు అక్కడి సమాచారాన్ని తెలుసుకున్నారు. కాశీకి వెళ్లకుండానే యాత్రికులు ఈ ఘటనతో వెనుదిరిగారు.



మంగళవారం రాత్రి ఓ హాల్‌లో బస చేసిన యాత్రికులు

ఎమ్మెల్యే చొరవతో..

మంగళవారం రాత్రి 10 గంటలకు ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్, కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు ఫోన్‌చేసి యాత్రికుల బస్సు దగ్ధమైన విషయాన్ని తెలిపారు. భైంసా డివిజన్‌కు చెందిన యాత్రికులను ఇక్కడికి తీసుకొచ్చేందుకు అక్కడి ప్రభుత్వంతో మాట్లాడి ఏర్పాట్లు చేయాలని కోరారు. యూపీలోని మథుర కలెక్టర్, పోలీసు, రెవెన్యూ అధికారులు సంఘటనపై దృష్టి సారించారు. యాత్రికులకు బృందావన్‌లోని టూరిస్ట్ పెనలిట్ సెంటర్‌లో వసతి కల్పించారు. అప్పటికప్పుడు దుప్పట్లు, ఇతర సామగ్రి తెప్పించారు. విషయం తెలుసుకున్న ఆర్ఎస్ఎస్ శ్రేణులు అక్కడి వ్యాపారులతో మాట్లాడి యాత్రికులకు భోజన ఏర్పాట్లు చేయించారు. దీర్ఘకాలిక వ్యాధులతో ఉన్న వారికి రోజువారీ మాత్రలను అందించారు. మంగళవారం రాత్రి అక్కడ బసచేసిన బృందానికి బుధవారం ఉదయం తిరిగి పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందు కోసం రెండు మినీ టూరిస్ట్ బస్సులు ఏర్పాటు చేసి ఒక్కో యాత్రికుడి దారి ఖర్చుల కోసం రూ.1000 చొప్పున అందించారు. మార్గమధ్యలో భోజనాలు చేసేందుకు ఆహార ప్యాకెట్లు, పండ్లు, బిస్కెట్లు, పాలు ప్యాక్‌చేసి ఇచ్చారు. బుధవారం బృందావన్ నుంచి మిగిలిన యాత్రికులు భైంసాకు తిరుగుపయనమయ్యారు. గురువారం రాత్రి వరకు వీరు భైంసాకు చేరుకోనున్నట్లు సమాచారం.

బృందావన్‌లోనే అంత్యక్రియలు

కుభీర్ మండలం పల్సి గ్రామానికి చెందిన శిల్యం ఎల్లుబాయి –దుర్పతి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ముగ్గురికి పెళ్లిళ్లు చేసిన ఈ దంపతులు మనుమలు, మనుమరాళ్లతో కాలక్షేపం చేస్తూ ఇంట్లో ఉండేవారు. వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ తీర్థయాత్రల కోసం డబ్బులు కూడబెట్టుకున్నారు. ఈక్రమంలో ఈనెల 1న కాశీయాత్రకు సిద్ధమయ్యారు. 15 రోజులపాటు అందరితో కలిసి పుణ్యక్షేత్రాలు దర్శించుకున్న శిల్యం దుర్పతి అనారోగ్యంతో బృందావన్‌లో దర్శనానికి వెళ్లలేకపోయాడు. బస్సులోనే నిద్రిస్తూ ఉండిపోయాడు. ఆ సమయంలోనే బస్సు మంటల్లో తగలబడడంతో అందులోనే సజీవ దహనమయ్యాడు. పుణ్యక్షేత్రాలకు జంటగా వెళ్లిన శిల్యం ఎల్లుబాయి తన భర్త సజీవ దహనాన్ని జీర్ణించుకోలేకపోయింది. బంధుమిత్రులు, తోబుట్టువులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో కట్టుకున్న భార్యే బృందావన్‌లో బుధవారం కాలిపోయిన భర్త శరీర భాగాలకు అంత్యక్రియలు నిర్వహించింది.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

ఖానాపూర్: పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో ఖానాపూర్ –తర్లపాడ్ ప్రధాన రహదారిపై ఆటో బోల్తా పడి నలుగురికి గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఖానాపూర్ నుంచి తర్లపాడ్ వైపునకు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడి వద్ద ఉన్న ట్రాక్టర్ జాకీ ఒక్కసారిగా కిందపడింది. అదే సమయంలో కడెం నుంచి ఖానాపూర్ వైపు వస్తున్న ఆటో జాకీపైకి ఎక్కి బోల్తాపడింది. దీంతో ఆటోలో ఉన్న డ్రైవర్ మహమూద్‌తో పాటు ప్రయాణికులు దస్తూరాబాద్ మండలానికి చెందిన సతీశ్, కడెం మండలానికి చెందిన జావీద్, హీనా సుల్తానాలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం 108లో నిర్మల్‌కు తరలించారు.

ట్రాక్టర్ పై నుంచి పడి యువకుడి మృతి

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లి గ్రామానికి చెందిన పల్లె శ్రీరామ్(19) అనే యువకుడు ట్రాక్టర్‌పై నుంచి కిందపడి మృతి చెందినట్లు కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం పెద్దనపల్లికి చెందిన చండే భీంసేన్, ట్రాక్టర్ డ్రైవర్ పంది లక్ష్మణ్‌లతో కలిసి శ్రీరామ్ ఈనెల 13న సోమగూడెం –బెల్లంపల్లి మధ్యలో గల రామలక్ష్మి సిమెంట్ బ్రిక్స్ నుంచి ట్రాక్టర్‌లో ఇటుక లోడ్‌ను దేవాపూర్‌కు తీసుకెళ్లాడు. అన్‌లోడ్ చేసి తిరిగి వస్తున్న క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా ట్రాక్టర్‌ను నడపడంతో శ్రీరామ్ ట్రాక్టర్ నుంచి కిందపడిపోయాడు. పొట్టభాగంలో తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి పల్లె శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నీలుగాయి మృతి

కుభీర్: మండలంలోని నిగ్వా దగ్గర బుధవారం నీలుగాయి మృతి చెందింది. రెండు నీలుగాయిల పొట్లాటలో ఒక నీలుగాయి గుంతలో పడిపోయింది. దానిపై కుక్కలు దాడి చేసి హతమార్చినట్లు పశువైద్యుడు ప్రకాశ్ తెలిపారు. అటవీ అధికారుల అనుమతితో దానికి పోస్టుమార్టం నిర్వహించి పూడ్చిపెట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

లారీని ఢీకొట్టిన కారు.. ఒకరు మృతి

బెల్లంపల్లి: సంక్రాంతి పండుగ పూట జరిగిన రోడ్డు ప్రమాదం ఓ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. బెల్లంపల్లి టూటౌన్ ఎస్సై కె.మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లో మెకానికల్ ఇంజినీర్‌గా పని చేస్తున్న అక్కు రాజు తన భార్య రేణుక (28), కొడుకుతో కలిసి కారులో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు బయల్దేరాడు. మార్గమధ్యలో బెల్లంపల్లి గంగారాంనగర్ వద్ద జాతీయ రహదారి పక్కన నిలిపి ఉన్న లారీని వేగంగా వచ్చి కారు ఢీకొట్టింది. ప్రమాదంలో రేణుక అక్కడికక్కడే మృతి చెందగా రాజుకు గాయాలయ్యాయి. కుమారుడు క్షేమంగా ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

రోడ్డు ప్రమాదంలో కన్నెపల్లి వాసి మృతి

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రానికి చెందిన దాగం సంతోష్ (51) పూణేలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. దాగం రమేశ్ –చుక్కమ్మల కుమారుడు దాగం సంతోష్ అమెరికాలో స్థిరపడ్డాడు. ఇటీవల ఇండియాకు వచ్చిన సంతోష్ జనవరి 9వ తేదీన పూణేకు కారులో వెళ్లి వస్తుండగా కారును లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. సంతోష్‌కు తీవ్ర గాయాలు కాగా కారులో ఉన్న మిగతా వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. సంతోష్ పూణేలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

ఎన్నో సేవా కార్యక్రమాలు..

అమెరికాలో స్థిరపడ్డ సంతోష్ పుట్టిన ఊరు కన్నెపల్లిలో కుటుంబ సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలు చేపట్టారు. కన్నెపల్లిలో సొంత ఖర్చులతో బస్‌షెల్టర్ నిర్మాణం, పాఠశాలకు స్టేజ్ ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన, శ్రీ వేంకటేశ్వర ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం అందించారు. గ్రామంలో హెల్త్ క్యాంప్‌లను సైతం ఏర్పాటు చేశారు.



సంతోష్ (ఫైల్)

వేర్వేరు కారణాలతో పలువురు ఆత్మహత్య

కడుపునొప్పి భరించలేక..

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన పడకంటి జలన్న(54) బుధవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సీహెచ్. భాస్కరాచారి కథనం ప్రకారం.. కల్లూరు గ్రామానికి చెందిన జలన్న రజక వృత్తి చేస్తూ, ఆవులు మేపుతూ జీవనం సాగించేవాడు. కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం మద్యం సేవించి కల్లూరులోని రేకుల షెడ్డుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెట్టుకు ఉరేసుకుని ఒకరు..

సోన్: మండలంలోని గంజాల్ గ్రామంలో చెట్టుకు ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. సోన్ ఎస్సై గోపి బుధవారం తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్ జిల్లా వైఎస్సార్ కాలనీకి చెందిన కొంచెం వెంకట్(52) గంజాల్‌లో కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల వైఎస్సార్ కాలనీకి చెందిన ఒక మహిళతో గొడవ విషయంపై పంచాయతీకి పిలిపిస్తారన్న భయంతో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి..

గుడిహత్నూర్: మండలంలోని మచ్చాపూర్ గ్రామానికి చెందిన నైతం పాండు (35) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మహేందర్ తెలిపిన ప్రకారం.. నైతం పాండు మద్యానికి బానిసై తరుచూ భార్య, కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. దీంతో కొన్ని రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో గత సోమవారం రాత్రి మద్యం మత్తులో ఉన్న పాండు పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. భార్య నైతం కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

మద్యం మత్తులో..

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి చెందిన కావుడే నవీన్ (26) అనే యువకుడు మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కావుడే నవీన్ గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. పండుగకు ముందు రోజు భార్య తిరుమల పుట్టింటికి వెళ్లింది. కాగా మద్యం మత్తులో నవీన్ గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి కావుడే దేవయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని పసికందు మృతదేహం లభ్యం

సారంగాపూర్: మండలంలోని జామ్ గ్రామంలోని కోమటి చెరువులో మంగళవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్సై శ్రీకాంత్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జామ్ గ్రామానికి చెందిన పలువురు కోమటి చెరువు సమీపంలో పశువులను మేపడానికి వెళ్లారు. ఈక్రమంలో వారికి గుర్తు తెలియని పసికందు మృతదేహం కన్పించింది. వెంటనే గ్రామస్తులు ఎస్సైకి సమాచారం అందించారు. పోలీసులు నెలలు నిండని పసికందు మగశిశువుగా గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బుధవారం జామ్ గ్రామంలో పసికందు మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రకు చెందిన సునీల్ (32) రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు టూటౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కిన్వట్‌లోని బోథ్ తాలుకాకు చెందిన సునీల్ గత కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 13న ఇంటి వద్ద పురుగుల మందు సేవించాడు. దీంతో గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

తొడసం వంశీయుల మహాపూజ

- తొడసం వంశీయుల సంప్రదాయ పూజ
- రెండు కిలోల నువ్వులనూనె తాగిన తొడసం ఆడపడుచు
- మహా పూజతో ప్రారంభమైన జాతర



ఖందేవునికి పూజ చేస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆర్ని కోలాపూర్ ఎమ్మెల్యే తొడసం రాజు భయ్యా

నార్నూర్: ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని ఖందేవ్ ఆలయంలో పుష్య పౌర్ణమి సందర్భంగా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. తొడసం వంశీయులు ఈ నెల 12న ఆదివారం మన్నాపూర్ వద్ద మాసేమాల్ పేన్ దేవతకు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి రాత్రి అక్కడే బస చేశారు. 13న సోమవారం సాయంత్రం ఖందేవ్ ఆలయానికి చేరుకున్నారు. అదేరోజు రాత్రి పుష్యపౌర్ణమి సందర్భంగా ఖందేవునికి మహాపూజ నిర్వహించారు. 14న మంగళవారం సంప్రదాయం ప్రకారం మూడోరోజు పూజా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తొడసం వంశీయుల ఆచారం ప్రకారం నువ్వుల నూనెను సేకరించి కటోడ దేవునికి నైవేద్యం సమర్పించారు. అనంతరం మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా జివితి తాలూకాలోని కొద్దేపూర్ గ్రామానికి చెందిన తొడసం వంశానికి చెందిన ఆడపడుచు మెస్రం నాగుబాయి రెండు కిలోల నువ్వులనూనె తాగి మూడోసారి మొక్కులు తీర్చుకుంది.

తొడసం వంశీయుల సంప్రదాయ భేటీ

ఖందేవ్ ఆలయ ప్రాంగణంలో మహాపూజ అనంతరం సంప్రదాయ భేటీ నిర్వహించారు. కొత్త కోడళ్లను దేవునికి పరిచయం చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన తొడసం వంశీయులు ఆలయ అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ తొడసం వంశీయుల ఆరాధ్య దైవమైన ఖందేవ్ ఆలయం నార్నూర్‌లో ఉండడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మహారాష్ట్రలోని ఆర్ని కోలాపూర్ ఎమ్మెల్యే తొడసం రాజు భయ్యా మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జేసీసీ చైర్మన్ మెస్రం రూప్‌దేవ్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, ఫ్యాక్స్ చైర్మన్ ఆడే సురేష్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు, ఖందేవ్ ఆలయ కమిటీ చైర్మన్ తొడసం నాగోరావు, ఆదివాసీ ఉద్యోగుల సంఘం నాయకులు మెస్రం శేఖర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

మూడోమొక్కు తీర్చుకున్నా..



మాది మహారాష్ట్రలోని జీవితి తాలుకా కొద్దేపూర్ గ్రామం. మా వంశ దైవం నార్నూర్‌లో ఉంది. ఏటా మహాపూజకు ఎడ్లబండిపై ఇక్కడికి వస్తాం. దైవసన్నిధిలో నువ్వులనూనె తాగి మొక్కు తీర్చుకోవడం ఇది మూడోసారి. మా ఆచారం ప్రకారం ఒక్కో ఆడపడుచు మూడేళ్ల పాటు ఈ కార్యక్రమం చేపట్టడం ఆనవాయితీ. ఇలా చేస్తే అంతా మంచి జరుగుతుందని మా నమ్మకం.

– మెస్రం నాగుబాయి, తొడసం ఆడపడుచు

బీజేపీ నాయకుడిపై దాడి

మంచిర్యాలక్రైం: మంచిర్యాల పట్టణంలోని ఫిష్ మార్కెట్‌లో స్థానిక బీజేపీ నాయకుడు మెట్టుపల్లి జయరామారావుపై బుధవారం పట్టపగలు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటన కలకలం రేపింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. జయరామారావు మార్కెట్‌లో చేపలు కొనుగోలు చేస్తున్నాడు. ముగ్గురు వ్యక్తులు ఆయన పక్కనే నిలబడి చేపలు కొనుగోలు చేస్తుండగా జయరామారావు చేయి వారిలో ఒకరికి తగిలింది. దీంతో ముగ్గురూ ఒకేసారి ఆయనపై దాడి చేశారు. పక్కనే ఉన్న ఇనుపరేకుతో తలపై కొట్టగా కిందపడిపోయాడు. కొందరు అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిని బెదిరిస్తూ అక్కడి నుంచి పారిపోయారు. జయరామారావుకు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అనంతరం.. మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆయనను బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పరామర్శించారు. అనంతరం రఘునాథ్‌రావు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే అనుచరులతో దాడి చేయించాడని ఆరోపించారు.

పాతకక్షలే కారణం..

మంచిర్యాలలోని ప్రముఖ రియల్ ఏస్టేట్ వ్యాపారి, కాంట్రాక్టర్ మంతెన జగన్‌మోహన్‌రావు, జయరామారావు మధ్య గతంలో స్థానిక రాళ్లపేటలోని డ్రైనేజీ నిర్మాణం విషయంలో గొడవ ఉంది. ఈ విషయంలో జయరామారావు మున్సిపాల్టీలో ఫిర్యాదు చేయగా పనులు నిలిపి వేశారని ఆయన భార్య లక్ష్మి తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని జగన్‌మోహన్‌రావు తన అనుచరులతో గతంలో దాడి చేశారని, మళ్లీ ఈ బుధవారం పాతకక్షలు దృష్టిలో ఉంచుకుని దాడి చేశారని ఫిర్యాదు చేసింది. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ప్రమోద్‌రావు తెలిపారు.



గాయపడిన జయరామరావును పరామర్శిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు

జయరామారావుపై ఫిర్యాదు

జయరామరావుపై దాడికి పాల్పడి ముగ్గురు వ్యక్తుల్లో ఒకరు మంచిర్యాలకు చెందిన డీటీ సాయితేజ జయరామారావుపై ఫిర్యాదు చేసినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. సాయితేజ తన ఇద్దరు స్నేహితులతో కలిసి చేపల కొనుగోలుకు వెళ్లగా అక్కడే ఉన్న జయరామరావు పాతకక్షలు దృష్టిలో ఉంచుకుని దాడి చేశాడని పేర్కొన్నట్లు తెలిపారు. సాయితేజ ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

అత్త డబ్బులు కోడలు స్వాహా

- బ్యాంక్‌లో రూ.5.13 లక్షలు ఫిక్స్‌డ్ చేసిన అత్త
- ఫోర్జరీ సంతకంతో మాయం చేసిన కోడలు
- బ్యాంకు ఉన్నతాధికారులకు ఫిర్యాదుతో వెలుగులోకి

ఆదిలాబాద్‌టౌన్: అత్త కష్టపడి డబ్బును బ్యాంక్‌లో డిపాజిట్ చేసుకోగా ఫోర్జరీ సంతకంతో కోడలు కాజేసిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జైనథ్ మండలంలోని బహదూర్‌పూర్ (ఆనంద్‌పూర్)కు చెందిన తిప్పారెడ్డి రేఖ ఆదిలాబాద్ పట్టణంలోని కలెక్టర్‌చౌక్‌లో గల టీజీబీలో గతంలో రూ.5లక్షల 13వేలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసింది. గత డిసెంబర్ 11న డబ్బులు తీసుకోవడానికి బ్యాంక్‌కు వెళ్లగా అకౌంట్‌లోని రూ.5లక్షల 20వేలు బడాల సంధ్యరాణి అనే అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ అయినట్లు అధికారులు తెలపడంతో ఒక్కసారిగా ఖంగుతింది. బాధితురాలు కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలియజేసి గత నెల 16న టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా బుధవారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. బాధితురాలు మాట్లాడుతూ తన కోడలు సంధ్యరాణి తండ్రి బడాల విలాస్ రెడ్డి అదే బ్యాంక్‌కు సంబంధించిన రిటైర్డ్ ఉద్యోగి కావడంతో డబ్బులను సునాయసంగా తన అకౌంట్‌లోకి మార్చుకున్నట్లు పేర్కొంది. తన సంతకం ఫోర్జరీ చేసి డబ్బులు తీసుకున్న కోడలుతో పాటు ఆమె తండ్రి, బ్యాంక్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ విషయమై తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ దాముక ప్రభుదాస్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందిందని విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



వివరాలు తెలియజేస్తున్న బాధితురాలు తిప్పారెడ్డి రేఖ